


## నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలి

నిర్మల్ ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురు వారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మంది రంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి నిర్మల్ ఉత్సవాల కార్యక్రమ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు.


# ప్రభాత సమాచారం

https: epaper. prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ శుక్రవారం | 3 జనవరి 2025 | ■ 10 పేజీలు




8

# యాసంగికి.. కడెం రెడీ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి నిర్మల్, మంచిర్యాల జిల్లాల రైతాంగానికి సాగునీరు అందించడంతోపాటు తాగునీటి అవసరాలు తీర్చే బహుళార్థ ప్రాజెక్టు కడెం మరమ్మతులు పూర్తయ్యాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పలుసార్లు తీవ్ర నిర్లక్ష్యానికి గురైన కడెం ప్రాజెక్టు చివరి ఆయకట్టు రైతాంగం అనేక అవస్థలను ఎదుర్కొన్నది. అయితే ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ప్రాజెక్టుపై పరిస్థితిపై పలుసార్లు నివేదించారు. ప్రాజెక్టు ప్రధాన ఆనకట్ట తెగిపోవడంతో పాటు పలుసార్లు గేట్ల మరమ్మతుకు సంబంధించి రైతాంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నది. అయితే ప్రభుత్వం ఎట్టకేలకు నిధులు మంజూరు చేయడంతో ప్రాజెక్టు మరమ్మతులు పూర్తయ్యాయి. ఇటీవల ట్రయల్‌రన్ నిర్వహించగా విజయవంతమైంది. దీంతో నీటి విడుదలకు ఇబ్బందులు తొలగి పోయాయి. దీంతో 5వ తేదీ నుంచి నీరు విడుదల చేసేందుకు ప్రాజెక్టు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

■ ప్రాజెక్టు మరమ్మతు పనులు పూర్తి ■ రూ.10కోట్లతో ప్రాజెక్టుకు మరమ్మతులు
■ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రత్యేక చొరవతో నీటి విడుదలకు సన్నాహాలు ■ ట్రయల్‌రన్ విజయవంతం..
■ ప్రాజెక్టుల్లో సరిపడా నీరు.. ■ 5వ తేదీన దిగువకు నీటి విడుదల చేయనున్న అధికారులు
■ 16వేల ఎకరాలకు అందనున్న సాగు నీరు ■ ఆయకట్టు రైతుల్లో హర్షం..



10

### మెడికల్ కళాశాల ఎదుట

## విద్యార్థుల ధర్నా

ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ సమస్యలను పరిష్కరించాలంటూ కళాశాల ఎదుట బైఠాయించిన నిరసన

ఆసిఫాబాద్ మెడికల్ కాలేజ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు గురువారం కళాశాల ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలలో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేక భోదనకు ఇబ్బందులు పడుతున్నామన్నారు.

### అధికారులు అంకితభావంతో 8లో

## విధులు నిర్వర్తించాలి

■ ఆపరేషన్ స్మైల్‌ను విజయవంతం చేయాలి
■ రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



వివిధ శాఖల అధికారులు అంకితభావంతో నిధులు నిర్వర్తించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా గురువారం రామగుండం కమిషనరేట్ పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

### వాహనదారులు రోడ్డు భద్రతా 3లో

## నియమాలు పాటించాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పని సరిగా పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా రవాణా అధికారి సంతోష్ కుమార్‌తో కలిసి రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు.



2లో

## నాగోబా జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు

■ 28 నుంచి మహాపూజ, నాగోబా జాతర ■ భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి
■ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ■ జాతర ఏర్పాట్లపై అధికారులపై సమీక్ష

కేస్లాపూర్ నాగోబా జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. నాగోబా ఆలయం దర్బార్ సమావేశంలో ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, అదనపు ఎస్పీ కాజల్, ఆలయ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. 28వ తేదీన మహా పూజ నాగోబా జాతర మొదలవుతుందని, భక్తులకు వసతులు కల్పించాలన్నారు.



# 28 నుంచి నాగోబా జాతర

- నాగోబా జాతరను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి..
- జాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ రాజర్షి షా సమీక్షా సమావేశం

**ఇంద్రవెల్లి, జనవరి 2 (ప్రభాత సమాచారం)**

ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్న నాగోబా జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, అదనపు ఎస్పీ కాజల్, టెంపుల్ కమిటి సభ్యులతో కలిసి నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ నుంచి నాగోబా జాతర ప్రారంభమవుతుందని, దీనికి సంబంధించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి ఇతర రాష్ట్రాల, మహారాష్ట్ర నుండి సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. భక్తుల కోసం ఉండడానికి అన్ని వసతులు కల్పించాలని, దీంతోపాటు దర్శనం సులభతరంగా జరిగేటట్లు అన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొదటి సమావేశం నిర్వహిస్తున్నామని, తర్వాత కోఆర్డినేషన్ మీటింగ్ 21న నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆలోగా ఆయా శాఖల సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కమిటీ సభ్యుల సూచన మేరకు రోడ్లు, తాగునీరు సౌకర్యం, టాయిలెట్స్, అత్యవసర వసతులు ఏమి ఉన్న వాటిని చేయడం జరుగుతుందని, పోలీస్ బందోబస్తు, తదితర యాక్షన్ ప్లాన్ తయారుచేసి పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవమైన నాగోబా జాతరకు గిరిజనులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలంగాణలోనే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లోని పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తుండటంతో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, భారీకెడ్స్, గట్టి బందబస్తు, తదితర ఏర్పాట్లు చేయడం జర్నుతుందన్నారు హైమాస్ట్ దీపాలతో ఆలయం, పరిసరాలలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఐటడీఏ ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ రేపటి నుండి నాగోబా జాతర పూజలు ప్రారంభమవుతాయని, అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, ముత్నూర్, హర్కాపూర్, తదితర రహదారులను సరి చేయాలనీ, గత ఏడాది లాగే ఈ జాతరను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులున్నారు.



## ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ



**బోథ్ (ఆదిలాబాద్), జనవరి 2 (ప్రభాత సమాచారం)**

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన వారితో గురువారం నేరేడిగొండలోని క్యాంపు కార్యాలయ పరిసరాలు కిలకిలలాడాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు, ప్రజలు, వివిధ కులాల సంఘం సభ్యులు క్యాంపు కార్యాలయానికి చేరుకొని ఎమ్మెల్యేకు పుష్పగుచ్చాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**ఇచ్చోడ, జనవరి 2 (ప్రభాత సమాచారం)**

ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామానికి చెందిన అంజన్నకు మంజూరు అయిన రూ. 25, 500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం నెరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పథకం కోసం క్యాంప్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**జన్నారం, జనవరి 2 (ప్రభాత సమాచారం)**

బీడీ కార్మికులకు పెన్షన్లను మంజూరు చేయాలని, బిడి అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ మండల నాయకులు దాసర్ల రాజన్న అన్నారు. గురువారం మండలంలోని ఇంధన్ పల్లి గ్రామ, బీడీ అండ్ సిగర్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గ్రామ కమిటీ సమావేశం బియ్యాల భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించగా ఆ సమావేశానికి రాజన్న ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీడీలు చుట్టే ప్రతి కార్మికురాలికి పెన్షన్లు మంజూరు చేయాలని, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, అట్లనే అర్హులైన బీడీ కార్మికులకు అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని, ప్రభుత్వాధికారులకు డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల పట్ల నిర్లక్ష్యం చేసి వారి సమస్యలు పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీడీ అండ్ శిగర్ వర్కర్స్ యూనియన్ గ్రామ కమిటీ నాయకులు జంగిలి వనిత, నల్లపు మహేశ్వరి, కొట్టు లక్ష్మి, పెంకర్ల సత్తవ్వ పాల్గొన్నారు.

# నిర్మల్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు





**ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్**

**నిర్మల్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ ఉత్సవాలకు పటిష్ట ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈనెల 5, 6, 7 తేదీలలో నిర్వహించనున్న నిర్మల్ ఉత్సవాల కార్యక్రమం ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మల్ ఉత్సవాలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. స్టేజి, స్టాల్స్, పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు జారీ చేశారు. స్టాళ్లు, స్టేజి ఏర్పాటు చేయబోయే ప్రదేశాలను పరిశీలించారు. వాహనాల పార్కింగ్ కు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, డీఆర్డీఓ విజయలక్ష్మి, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, తహసిల్దార్ రాజు, అధికారులు పాల్గొన్నారు.



## రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

**జన్నారం, జనవరి 2 (ప్రభాత సమాచారం)**

స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు బీఆర్ఎస్ పార్టీ బలపరిచే అభ్యర్థుల విజయం సాధించేలా తమ సత్తాచాటాలని ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జాన్సన్ నాయక్ సూచించారు. గురువారం పొనకల్ గ్రామంలో మాజీ ఎంపీపీ సరోజన, మాజీ పీఏసీఎస్ చైర్మన్ శీలం రమేష్‌లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. పార్టీ కార్యకర్తలు నాయకులు ఐక్యతతో ఉండి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఎర్ర చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ వినయ్ కుమార్ మాజీ కోపం సభ్యులు మున్వర్ అలీ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్ కుమార్, యూత్ అధ్యక్షులు పేరం శ్రీనివాస్ నాయకులు ఫజల్ ఖాన్, బలసాని శ్రీనివాస్ గౌడ్, రాగుల శంకర్ రాకేష్ నరస గౌడ్, కొండుకూరి రాజు స్వామి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం..

**ఆసిఫాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం వాంకిడి మండలంలోని బాంబర గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అప్పల సంతోష్ కి 23,500 రూపాయల చెక్కును శాసన సభ్యురాలు కోవ లక్ష్మి అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అజయ్ కుమార్, పేంటు సయ్యద్ అయ్యుబ్, నేపాజి, శైలు, మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# కొమరంభీం విగ్రహాన్ని సందర్శించిన ఏఎస్పీ చిత్తరంజన్

**ఆసిఫాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**

కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్డీపీఓగా బాధ్యతలు స్వీకరించిన ఎఎస్పీ చిత్తరంజన్ గురువారం కెరామెరి మండలం జోడేఘాట్‌లోని ఆదివాసీ గిరిజన నాయకుడు కుమ్రంభీం విగ్రహాన్ని సందర్శించి పూలమాల వేశారు. అనంతరం ఆదివాసీ నాయకులను కలిశారు. కొమరంభీం మ్యూజియాన్ని సందర్శించి, గిరిజన ఆచార సంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సహాయం అందిస్తామన్నారు. అనంతరం కెరామెరి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ ఫైళ్లను, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు.









# రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు

## నవజ్యోతి యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం - కలెక్టర్ రాజర్షి షా

**ఇంద్రవెల్లి, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
రక్తదానం చేయడం ద్వారా అత్యవసర సమయాల్లో బాధితుల ప్రాణాలు కాపాడవచ్చని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం ఇంద్రవెల్లి మండలం పిట్ట బొంగరం గ్రామంలో నవజ్యోతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దాదాపుగా 150 మంది స్వచ్ఛందంగా శిబిరానికి వచ్చి రక్తదానం చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. మనిషి శరీరంలో ఐదు లీటర్ల రక్తం ఉంటుందని అందులో 330 ఎంఎల్‌ల రక్తం మాత్రమే తీసుకోవడం జరుగుతుందని, రక్తదానం చేసేందుకు ఎలాంటి అపోహలను నమ్మవద్దని అన్నారు. రక్తదానం చేయడం వల్ల ముగ్గురు ప్రాణాలను కాపాడిన వారమవుతామని, ముఖ్యంగా ఎనీమియా తల సేమియా తో పాటు గర్భిణీలు ప్రసూతి సమయంలో ప్రమాదాల సమయాల్లో, కొంతమంది రోగుల శాస్త్ర చికిత్సలకు రక్తం అవసరమవుతుందని తెలిపారు. మూఢనమ్మకాలను పక్కనపెట్టి రక్తదానం చేసేందుకు గిరిజనులు ముందుకు రావాలని, ప్రతి గ్రామాల్లోని యువత వైద్య ఆరోగ్య సిబ్బంది డ్వాక్రా మహిళలు రక్తదానంపై అవగాహన కల్పించాలన్నారు. పౌష్టికారలోపాన్ని దృష్టిలో ఉంచుకోవాలని, గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం, అందుకు స్వచ్ఛందంగా శిబిరానికి వచ్చి రక్తదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఐటీడీఏ పీవో కుష్బూ గుప్త మాట్లాడుతూ రక్తహీనత ఎక్కువగా ఉందని ఎవరు బాధపడనవసరం లేదని ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలలో అన్ని రకాల పౌష్టికాహారం సరఫరా చేయడం జరుగుతుందని, అంతే కాకుండా ప్రతి ఒక్కరూ పల్లిబట్టీలు తినాలని, రక్తహీనత పై వైద్య ఆరోగ్యశాఖ ద్వార అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువ రాజ్ మర్మట్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు ఎస్పీ కాజల్, రాజేశ్వర్ పటేల్, భీంరావ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, నరేందర్, మనోహర్, శ్రీధర్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపిడిఓ భాస్కర్ పాల్గొన్నారు.





### బాధితులకు మూడు

# సెల్ ఫోన్లు అప్పగింత



**కాగజ్‌నగర్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ మండలం ఈస్గాం పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు యువకులు తమతమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్లను పట్టుకుని గురువారం బాధితులు రామ్ రాయ్, దాడి రవి, సాయిలకు అప్పగించారు. ఎస్ఐ మహేందర్ మాట్లాడుతూ.. మొబైల్ పోయిన లేదా దొంగిలించబడిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేస్తే మొబైల్ ట్రేస్ త్వరగా అవుతుందన్నారు.

# ఇంటి నుంచి వెళ్లి వృద్ధుడు అదృశ్యం

**లోకేశ్వరం, జనవరి 2 (ప్రభాత సమాచారం)**



వృద్ధుడు అదృశ్యమైన ఘటన గురువారం నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన కొండపురం అంజరెడ్డి (82) మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఆయన కుమారుడు రాజేశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

## జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస్ రావు



**ఆసిఫాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మడవి ఆనంద్ 4 నవంబర్ 2024 న గుండె పోటుతో మరణించగా ఆయన భార్యకు ఒక లక్ష ఇరవై ఒక్క వేల(1,21,000) విలువ చేసే పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీ చెక్కును గురువారం జిల్లా ఎస్పీడివి శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ కుటుంబ ప్రస్తుత స్థితిగతులను ఎస్పీ అడిగి తెలుసుకోవడంతో పాటు, వారి కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వపరంగా అందాల్సిన ఇతర బెనిఫిట్లను తక్షణమే అందజేసే విధంగా చూస్తామన్నారు. పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో పాటు వారి కుటుంబాలకి అండగా ఉంటామని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు విజయ శంకర్ రెడ్డి, జిల్లా కోఆపరేషన్ సొసైటీ అకౌంటెంట్ జాఫర్, సీసీ కిరణ్, ఆనంద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసు లాంఛనాలతో షేక్ అక్తర్ అంత్యక్రియలు

**ఆసిఫాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
అసిఫాబాద్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ అక్తర్ డిసెంబర్ 31న పోలీసు కార్యాలయానికి వెళుతుండగా ఇంటి వద్ద ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయను ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అదిలాబాద్ రిమ్స్ నుంచి హైదరాబాద్‌లని కిమ్స్ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ షేక్ అక్తర్ మృతి చెందాడు. దీంతో జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పోలీసు లాంఛనాలతో షేక్ అక్తర్ అంత్యక్రియలను నిర్వహించారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య, జిల్లా పోలీస్ సంఘ అధ్యక్షులు విజయ శంకర్ రెడ్డి, ఆర్ఎస్ఐ కిరణ్ ఆధ్వర్యంలో 30 వేల రూపాయలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎస్పీ వారి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. అధైర్య పడొద్దని పోలీసు శాఖ అండగా ఉంటుం దని ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాస్ రావు వారికి భోరసా ఇచ్చారు.





### వాహనదారులు రోడ్డు భద్రతా

# నియమాలు పాటించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పని సరిగా పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ లో జిల్లా రవాణా అధికారి సంతోష్కుమార్ తో కలిసి రోడ్డు భద్రతా మాసోత్సవాల సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణలో తమ వంతు పాత్ర పోషించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు, ఇతర వాహనాల చోధకులు సీట్బెల్ట్ తప్పనిసరిగా పాటించాలని, కూడళ్ళ వద్ద సిగ్నల్స్‌ను తప్పనిసరిగా అనుసరించాలని, నియంత్రిత వేగంతో వాహనాన్ని నడపాలని తెలిపారు. వాహనం నడిపే సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, మద్యం సేవించి వాహనం నడుపకూడదని, వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు అనేక చర్యలు తీసుకుంటుందని, వేగ నిరోధకాలతో పాటు వాహనదారులు అర్థమయ్యే విధంగా ప్రమాద ప్రాంతాలు, మూలమలుపు ఇతర అన్ని ప్రాంతాలలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం జరుగుతుందని, జిల్లా రవాణా శాఖ నుండి సేవలను మరింత వేగంగా అందించడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రతా నియమ, నిబంధనలను వివరిస్తూ ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డిటిడివోను కలిసిన సిఐటియూ నాయకులు

**ఆసిఫాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
జిల్లా గిరిజన సంక్షేమశాఖ అభివృద్ధి అధికారి రమకు తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సి.ఐ.టి.యు అధ్వర్యంలో, హాస్టల్ వర్కర్ల పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఎరియర్స్‌తో చెల్లించాలని కోరుతూ వర్కర్ల సమక్షంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమశాఖ అభివృద్ధి అధికారి రమ మాట్లాడుతూ వర్కర్లకు రెండు నెలల వేతనంకు సరిపడ బడ్జెట్ రిలీజ్ అయ్యిందని వేతనాలు త్వరలోనే చెల్లింపులు చేయనున్నామని తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీ వేజ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్ జిల్లా గౌరవ అధ్యక్షులు, వెలిశాల క్రిష్ణమాచారి, జిల్లా అధ్యక్షులు అడ శ్యాం రావ్, జిల్లా కమిటీ సభ్యులు సిడం జంగూ,సంపత్,వసంత్రావ్,దీపక్, కుర్సెంగ్ రావ్,చందు,కుడ్మెత సంతోష్ పాల్గొన్నారు.





## రెండో రోజుకు చేరిన హమాలీల సమ్మె

**ఆదిలాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
సివిల్ సప్లై కమిషనర్ పెరిగిన రేట్ల జీవో అమలు చేయాలని ఆదిలాబాద్‌లోని సివిల్ సప్లై గోదాం ఎదుట హమాలీల చేపట్టిన సమ్మెకు గురువారం రెండో రోజుకు చేరుకుంది. హమాలీల సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సిర్ర దేవేందర్ మద్దతు తెలిపారు. ప్రజాపాలన కొనసాగిస్తున్నామని అంటున్న సీఎం సివిల్ సప్లై హమాలీల సమస్యలను ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలన్నారు.

## పరిశ్రమల శాఖలో ప్రజావాణి



**ఆదిలాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషన్ రాజు అన్నారు. గురువారం ఆదిలాబాద్ లోని పరిశ్రమల శాఖలో వివిధ రుణాలకు దరఖాస్తుల వారీ కోసం ప్రజావాణి నిర్వహించారు. నిరుద్యోగులు వారి ప్రపోజల్స్‌ను మేనేజర్‌కు అందించారు. వాటిని పరిశీలించి పలు సూచనలు చేశారు. నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేలా ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయని తెలిపారు.

## సీపీఐ నేత బర్ధన్‌కు నివాళి



**బెల్లంపల్లి, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
సీపీఐ నేత ఏ.బి.బర్ధన్ తొమ్మిదవ వర్ధంతిని గురువారం బెల్లంపల్లి పట్టణంలోని స్థానిక కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. పట్టణ కార్యదర్శి రాజమౌళి, సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య ఆధ్వర్యంలో బర్ధన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బొంతల లక్ష్మీనారాయణ, గుండా చంద్రమాణిక్యం, మేకల రాజేశం, కొంకుల రాజేశ్, రత్నం రాజం తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో సంవత్సరం జైలు శిక్ష

**జన్నారం, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
ద్విచక్ర వాహనం దొంగిలించిన కేసులో ముద్దాయికి లక్షెట్టిపేట న్యాయమూర్తి గురువారం ఒక సంవత్సరం శిక్ష విధించినట్లు జన్నారం ఎస్సై గుండేటి రాజా వర్ధన్ రెడ్డి తెలిపారు. జన్నారంలోని ఉడిపి హోటల్ ముందు పార్క్ చేసి ఉన్న చింతకుంట గ్రామం కొత్తపల్లి మండలం కరీంనగర్ జిల్లాకు చెందిన మహమ్మద్‌కు చెందిన పల్సర్ బైక్‌ను దొంగిలించిన ఘటనలో జన్నారం పోలీసులు విచారణ చేపట్టగా నిందితులు హైదరాబాద్, నిజామాబాద్, ఆర్మూర్, చుట్టుపక్కల గ్రామాల నుండి 14 ద్విచక్ర వాహనాలను దొంగిలించారని విచారణలో తేలడంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ సందర్భంగా జన్నారం ఎస్సై రాజ వర్ధన్ రెడ్డి, కోర్ట్ కానిస్టేబుల్ మధుకర్, హెడ్ కానిస్టేబుల్ ఎండి.గౌస్, బి.తుకారం కానిస్టేబుళ్లు కే.భాస్కర్, బి.సురేష్ ఎల్.వెంకటేష్‌లను అభినందించారు.

## టిజిఓ ద్వారా విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలు



### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్..

**మంచిర్యాల, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ద్వారా విద్యార్థులకు ఉచిత లాంగ్ నోట్ పుస్తకాలు అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్‌ను నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వనజ రెడ్డి, అత్తి సుధాకర్, ప్రతినిధులతో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ తమ అసోసియేషన్ తరపున విద్యార్థుల ఉపయోగార్థం లాంగ్ నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉచిత లాంగ్ నోట్ పుస్తకాలు అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### పదవీ విరమణ చేసిన సీఆర్పీఎఫ్

## ఎస్ఐ సర్కార్‌కు స్వాగతం



**కాగజ్‌నగర్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
ఢిల్లీలో 37 సంవత్సరాలుగా సీఆర్పీఎఫ్ బెటాలియన్లో ఎస్ఐగా పనిచేసి రిటైరై కాగజ్ నగర్ పట్టణానికి విచ్చేసిన చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్ -1 గ్రామానికి చెందిన ఆర్ఎన్ సర్కార్ కి రైల్వే స్టేషన్లో స్వాగతం పలికి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సేవ కోసం అంకితమైన ఆర్ఎన్ సర్కార్ బాటలో యువత నడవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు సూచించారు.

### సహకార సంఘాలు రైతుల పరపతిని పెంచి

# ఆర్థికంగా పరిపుష్టం చెందాలి




### అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

**మంచిర్యాల, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
సహకార సంఘాలు రైతుల పరపతిని పెంచి ఆర్థికంగా పరిపుష్టం కావాలని, రైతులకు విశిష్టమైన సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రాథమిక వ్యవసాయ సహాయక సంఘాల పునర్విభజన అంశంపై జిల్లా సహకార అధికారి బి.సంజీవరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు శంకర్, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఎ.జి.ఎం. రామకృష్ణ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతిలతో కలిసి సహకార సంఘాల ప్రతినిధులు, మండల వ్యవసాయ అధికారులు, బ్యాంక్ మేనేజర్లు, సూపర్వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదనలు సమర్పించే సమయంలో సహకార సంఘాల ఆర్థిక పరిపుష్టిత, వ్యాపార లావాదేవీలు, సంఘ సిబ్బంది వివరాలు, భౌగోళిక సమస్యలను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఉపయోగపడే విధంగా పునర్విభజన జరగాలని తెలిపారు. గ్రామీణ రైతుల అవసరాల ప్రాతిపదికన నూతనంగా ఏర్పాడిన రెవెన్యూ మండలాల ప్రాతిపదికన రైతు సహకార సంఘాల పునర్విభజన చేయాలన్నారు. సహకార సంఘాల పునర్విభజన రైతులకు ప్రయోజనకరంగా ఉండాలని తెలిపారు.

## తేమ పేరుతో పత్తి రైతులకు అన్యాయం



**ఆదిలాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
పత్తి నాణ్యతలేదని కుంటి సాకుతో రైతులని సీసీఐ అధికారులు మోసం చేస్తున్నారని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న అన్నారు. గురువారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంద్రవెల్లి, నార్నూర్, బేలా, ఇచ్చోడ, గుడిహత్నూర్ మార్కెట్ లో జీన్నింగులు ఉన్న కూడా ప్రయివేట్ వ్యాపారస్తులు రైతుల నుండి అతి తక్కువ ధరకి కొనుగోలు చేసి అదే పత్తిని తన గుప్పెట్లో ఉన్న రైతులకు రూ.5వేల నుండి రూ.8 వేల వరకు కమిషన్ ఇచ్చి ఆ రైతు పేరున అమ్ముతున్నారని అన్నారు. దీనిపై నిజమైన రైతులు అయితే ఒక్కొక్క రైతు పేరున భూమి కొంత ఉండి పత్తి వందల క్వింటాళ్ళు అమ్ముతున్నారని పేర్కొన్నారు. మరో పక్క కౌలు రైతుల పేరిట సెల్ఫ్ డిక్లరేషన్ పేరిట మరొక మోసం జరుగుతుందన్నారు. దీనిపైన జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించాలని, అదే విదంగా విజిలెన్స్ అధికారులతో విచారణ చేయాలని అన్నారు. కార్యక్రమంలో శంకర్, గంగయ్య, ఖాదీర్, దిలీఫ్, జంగు తదితరులుపాల్గొన్నారు.

### రైతుల ఖాతాలలో 95 కోట్ల

## 24 లక్షల రూపాయలు జమ

### అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

**మంచిర్యాల, జనవరి 2 (ప్రభాత సమాచారం)**



ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో 317 వరి ధాన్యం కొనుగోలు ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి 95 కోట్ల 24 లక్షల రూపాయల నగదు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రతిపాదించిన 326 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటి వరకు 317 కొనుగోలు కేంద్రాల ద్వారా 77 వేల 507 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఇందులో 26 వేల 111 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం ఉందని, సంబంధిత 8 వేల 169 మంది రైతుల ఖాతాలలో 95 కోట్ల 24 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 26 రైస్ మిల్లులకు సి.ఎం. ఆర్. అనుమతులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 168 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తి చేసి మూసి వేయడం జరిగిందని తెలిపారు.

# నిర్మల్ ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**అధికారులకు నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశం**






**నిర్మల్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి నిర్మల్ ఉత్సవాల కార్యక్రమానిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 5, 6, 7 వ తేదీలలో మూడు రోజులపాటు జరగబోవు నిర్మల్ ఉత్సవాల కార్యక్రమాలను జిల్లా సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా నిర్వహించాలని ఆదేశించారు. అధికారులంతా శాఖల వారీగా కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఎక్కువ సంఖ్యలో స్టాళ్లను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్మల్ జిల్లా చరిత్రను తెలియజేసే విధంగా ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థులచే సంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలను ఆకట్టుకునే విధంగా హోర్డింగులు ఏర్పాటు చేసి, కరపత్రాలను పంపిణీ చేయాలన్నారు. నిర్మల్ ఉత్సవాల కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సందర్శకులకు త్రాగునీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలనీ, పోలీసు శాఖ వారి సహకారంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్మల్ ఉత్సవాలను నిర్వహించాలన్నారు. సందర్శకులకు అన్ని వివరాలు తెలిసే విధంగా సూచికల బోర్డులను ఏర్పాటు చేయాలని, కార్యక్రమాన్ని సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచాలన్నారు. అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినప్పుడు విద్యుత్ సరఫరాలో ఆటంకం లేకుండా చూడాలన్నారు. అనంతరం ముధోల్ శాసనసభ్యులు రామారావు పటేల్ మాట్లాడుతూ, నిర్మల్ ఉత్సవాల పేరిట కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం గొప్ప విషయమని తెలిపారు. ఈ కార్యక్రమ విజయవంతానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, అదనపు ఎస్పీ ఉపేంద్ర రెడ్డి, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం, బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా టీచర్స్ డేను నిర్వహించాలని కలెక్టర్లకు ఆదేశం

**ఆదిలాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ఏడాది జనవరి 3న సావిత్రిబాయి ఫులే జయంతిని మహిళా టీచర్స్ డేగా నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. మహిళల విద్య కోసం సావిత్రిబాయి ఫులే చేసిన కృషిని గౌరవించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టుగా తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా జనవరి3వ తేదీని 'మహిళా టీచర్స్ డే'గా నిర్వ హించాలని కలెక్టర్లను ఆదేశించింది. ఇందుకోసం అయ్యే ఖర్చును విద్యా శాఖ బడ్జెట్ నుంచి కేటాయించాలని తెలి పింది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ కూడా అవసరమైన చర్యలకు తక్షణమే తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

# జిల్లా అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగాలి

**కలెక్టర్ వెంకటేష్ దోత్రే..**

**ఆసిఫాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
జిల్లా అభివృద్ధికి అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులు, జర్నలిస్టులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు దీపక్ తివారి, డేవిడ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీఅధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వర్, డీపీఆర్వో సంపత్‌కుమార్, ఆయాశాఖలఅధికారులు, జర్నలిస్టులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు మెనూప్రకారం
# భోజనం అందించాలి

**వాంకిడి, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
మెనూప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం మండలంలోని బంబార ఆశ్రమ పాఠశాలను, వంట గదిని పరిశీలిం చారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహ పరిసర ప్రాంతాలతోపాటు వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల న్నారు. పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గంజాయి పట్టివేత..

**జైనూర్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
ఓ ఇంట్లో రవాణాకు సిద్ధంగా నిల్వ ఉంచిన గంజాయిని జైనూర్ టాస్క్ ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. జైనూర్ ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. జైనూర్ మండలం పోచంలోద్ది గ్రామంలోని షేక్ ఖయ్యుమ్ ఇంట్లో గంజాయి నిల్వ ఉందన్న విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేశారు. 1 కేజీల 400 గ్రాముల గంజాయిని స్వాధీన పరచుకొని, షేక్ ఖయ్యూమ్‌ను అదుపులోకి తీసుకున్నారు.



# జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన డిఐఈఓ



**బజార్‌హత్నూర్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం డిఐఈఓ రవీందర్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థుల హాజరు రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టుదల క్రమశిక్షణతో చదువుకొని మంచి ప్రణాళిక ద్వారా ఉన్నత శిఖరాలను అవరోధించాలని అన్నారు. రానున్న వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. వెనుకబడ్డ విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి అయ్యేలా చూడాలని అధ్యాపక బృందాన్ని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీల్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ఏబీ బర్ధన్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

**మంచిర్యాల, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
కమ్యూనిస్టు సైద్ధాంతిక తత్వవేత్త ఏబీ బర్ధన్ స్ఫూర్తితో ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు శంకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో బర్ధన్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు శంకర్ మాట్లాడుతూ బర్ధన్ చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలను అనుసరించి ప్రజలతో, కార్యకర్తలతో నిరాడంబరమైన జీవితాన్ని గడిపారన్నారు. లక్ష్మణ్, కలీందర్‌ఖాన్, మల్లయ్య, నగేష్, రవి, పోలు, పోచన్న, శంకరయ్య, రామన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.




# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు**

**ఆసిఫాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి సంబంధించిన ప్రొసిడింగ్ కాపీని మాజీఎమ్మెల్యే ఆత్రంసక్కుతో కలిసి జర్నలిస్టులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జర్నలిస్టులు ఎదురుచూస్తున్న ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణం కాంగ్రెస్ హయాంలోనే చేపడుతామని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజక వర్గంలో చేపట్టే నాలుగుపనుల కోసం రూ.57లక్షలు ఎస్డీఎఫ్ నిధుల కింద మంజూరైనట్లు తెలిపారు. ఆసిఫాబాద్ పట్టణంలో జర్నలిస్టుల భవన నిర్మాణానికి రూ.25లక్షలు, గుండాల గ్రామంలో అభివృద్ధి పనుల కోసం రూ.8లక్షలు, రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలో కమ్యూనిటీ షెడ్లనిర్మాణం కోసం రూ.10లక్షలు, ఆలయ ముఖద్వారం నిర్మాణం కోసం రూ.14లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. వీలైనంత త్వరగా నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలే ష్‌గౌడ్, మల్లేష్, చరణ్, అబ్దుల్లా, అసద్, విశాల్, సలాం, జర్నలిస్టులు పాల్గొన్నారు.







**జాగ్రత్తలు పాటించాలి**

# పెట్స్‌తో.. జర పైలం!

## ప్రతి 3 జబ్బుల్లో 2 జంతువుల నుంచే

- స్వైన్ ఫ్లూ, బర్డ్ ఫ్లూ., రేబిస్, నిఫా వైరస్ వంటివన్నీ అటాక్
- టీబీ కూడా సోకే చాన్స్..
- అప్రమత్తత అవసరమంటున్న నిపుణులు

**జంతువులతో మానవుని సహచర్యం** చాలా కాలంగా కొనసాగుతోంది. ప్రతి ఒక్కరూ పశు పక్షాదుల నుంచి ఉత్పత్తి అయ్యే పాలు, గుడ్లు, మాంసంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడాల్సిందే. జంతువుల్లో పెంపుడు కుక్కను మించిన విశ్వాసపాత్రమైనది మరొకటి లేదు. ఈ సహచర్యంలో కొన్ని వ్యాధులు జంతువుల నుంచి మనుషులకు తెలియకనే సంక్రమిస్తున్నాయి. ఆధునిక వైద్య పరిజ్ఞానం ఎంత డెవలప్ అయినా కొన్ని వ్యాధులకు ఇప్పటికీ ట్రీట్‌మెంట్ లేని పరిస్థితి ఉంది. స్వైన్ ఫ్లూ, బర్డ్ ఫ్లూ, రేబిస్, హెచ్ఐవీతో పాటు ఇప్పుడు ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ (కోవిడ్19) కూడా జంతువుల నుంచే మానవులకు సంక్రమించిందనే వాదన ఉంది. మనుషులకు వచ్చే ప్రతి మూడు జబ్బుల్లో రెండు జంతువుల నుంచే సోకుతున్నాయని సైంటిస్టులు చెబుతున్నారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా జంతువుల నుంచి సంక్రమించే వ్యాధుల (జూనోటిక వ్యాధులు)పై ప్రత్యేక కథనం.

### బర్‌ఫ్లూ..

బర్డ్‌ఫ్లూ లేదా ఇన్‌ఫ్లూయెంజా వ్యాధి కోళ్లను, ఇతర పక్షులను ఆశిస్తుంది. ఇది వైరస్ వల్ల కలిగే వ్యాధి. ఈ వైరస్‌లో 144 ఉప రకాలున్నాయి. ఇది కోళ్లు, పక్షుల నుంచి మానవాళికి సంక్రమిస్తుంది. 1997లో ఖండాతర వ్యాధిగా రూపొంది చాలా దేశాల్లో కోట్ల కొలది కోళ్లు మరణించాయి. ప్రధానంగా వీటి పెంకందారులు, షెడ్లలో పనిచేసే వారికి త్వరితగతిన ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకిన కోళ్లు, పక్షులు అకస్మాత్తుగా మరణిస్తాయి. వ్యాధి సోకిన మనుషుల్లో జలుబు, గొంతునొప్పి, దగ్గు, కండ్లకలకతో మొదలై ఊపిరితిత్తుల్లో రక్తం చేరి మరణానికి దారి తీస్తుంది.





జంతువుల నుంచి మనుషులకు, వారి నుంచి జంతువులకు 190 రకాల వ్యాధులు సోకుతాయని నిపుణులు చెబుతున్నారు. బర్డ్‌ఫ్లూ, స్వైన్‌ఫ్లూ వంటి వ్యాధులతో పాటు రేబిస్, టీబీ, జపనీస్ ఎన్‌సఫలైజేషన్ వంటి వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉంది. కుక్కకాటు ద్వారా రేబిస్, పందుల ద్వారా జపనీస్ ఎన్‌సఫలైజేషన్ (మెదడువాపు), పశువులు, గొర్రెలు వంటి ద్వారా టీబీ సోకుతున్నాయి. జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులను జూనోటిక వ్యాధులు అంటారు.




### బ్రూసెల్లోసిస్:

పశువుల్లో బ్రూసెల్లా అబార్టస్ బ్రూసెల్లా మెలిటెన్సిస్ అనే బ్యాక్టీరియా వల్ల కలుగుతుంది. ఈ వ్యాధి అన్ని జాతుల పశువులకు, మనుషులకు సోకుతుంది. వ్యాధి సోకిన పశువుల్లో జ్వరం వచ్చి ఈడుసుకుపోవటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మగ పశువుల్లో తాత్కాలికంగా లేదా శాశ్వతంగా వంధ్యత్వం ఏర్పడుతుంది. ఇవిగాక మైక్రో బ్యాక్టీరియా బ్యుటర్‌క్యులోసిస్ బ్యాక్టీరియా వల్ల క్షయ లేదా టీబీ వంటి వ్యాధులు వ్యాపిస్తాయి.

### రేబిస్ ..

రేబిస్ వ్యాధి సోకితే చికిత్స లేదనేది వాస్తవమే కానీ, అన్ని కుక్కల వల్ల రేబిస్ వస్తుందనేది అపోహ మాత్రమే. అవగాహన లోపం కారణంగా ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రేబిస్ వ్యాధి రాబ్‌డో అనే వైరస్ వల్ల సోకుతుంది. ఇది ఎక్కువగా అడవుల్లో ఉండే క్రూర జంతువులు, గబ్బిలాల్లో ఎటు వంటి లక్షణాలు చూపించకుండా ఉంటుంది. ఈ వైరస్ గాలి, నీటి ద్వారా మార్పు చెందుతుంది. గబ్బిలాలు చనిపోవడం, వాటిని కుక్కలు తినడం వల్ల వాటిలో ఉన్న వైరస్ కుక్కలకు వ్యాప్తి చెందుతుంది. ఈ వైరస్ ఉన్న కుక్కలు మనుషులను, పశువులను కరవడం వలన లాలాజలం ద్వారా సంక్రమిస్తుంది.



### జూనోసిస్ డే..

లూయిస్‌పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటిసారిగా 1885 జులై 6న పిచ్చికుక్క కాటు-కు గురైన బాలుడికి నిరోధక టీకా ఇవ్వడం ద్వారా రేబిస్ వ్యాధి రాకుండా కాపాడగలిగారు. అప్పటి నుంచి ఏటా జులై 6న జూనోసిస్ దినోత్సవంగా జరుపుతున్నాం. ఈ సందర్భంగా వ్యాధులు, సంక్రమణ విధానంతోపాటు నివారణపై ప్రజలకు అవగాహన కలిగించాలి.

### జూనోటిక వ్యాధి కారకాలు 7 రకాలు

- బ్యాక్టీరియా: ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్ లెప్టోస్పైరోసిస్, క్షయ
- వైరస్: రేబిస్, బర్డ్ ఫ్లూ, మెదడు వాపు, సార్స్
- ప్రొటోజువా: టాక్సోప్లాస్మోడియా, లైష్‌మెనియాసిస్
- రెకెట్సియా: టైఫస్, క్యూఫీవర్
- హెల్మెంథ్స్: ఎకైనోకోకోసిస్, టీనియాసిస్
- ఎక్టోపారాసైట్స్: స్కేబిస్ పశువుల్లో రేబిస్ లక్షణాలు




# తుది ఓటరు జాబితా ప్రచురణకు సిద్ధం

- ఓటర్ల జాబితా పరిశీలకులు సురేంద్రమోహన్
- కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి తుది ఓటరు జాబితా ప్రచురణపై సమీక్షా సమావేశం..
- 6న గుర్తింపు పొందిన పార్టీలకు అందజేత..

**మంచిర్యాల, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2025లో భాగంగా చేపట్టిన ప్రక్రియ పూర్తి చేసుకొని తుది ఓటరు జాబితా ప్రచురణకు సిద్ధం చేయడం జరిగిందని ఓటర్ల జాబితా పరిశీలకులు సురేంద్రమోహన్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, మంచిర్యాల, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, భైంసా రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణ, లోకేశ్వ ర్రావు, కోమల్రెడ్డి, చెన్నూర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి. చంద్రకళలతో కలిసి ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లతో తుది ఓటరు జాబితా ప్రచురణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా పరిశీలకులు మాట్లాడుతూ 01-01-2025 నాటికి 18 సంల వయస్సు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకోవడంతో పాటు జాబితాలో రెండు / మూడు ఎపిక్ కార్డులు కలిగిన, చిరునామా మారిన, మరణించిన వారి వివరాలు మార్పులు, సవరణలు, తొలగింపులపై భారత ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఒకే కుటుంబానికి సంబంధించి కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చే విధంగా బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన బూత్ ఏజెంట్ల సమన్వయంతో తగు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఓటు నమోదు చేసుకునేందుకు జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 తేదీలను ప్రామాణికంగా తీసుకుంటుందని, ప్రజలందరికీ తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, ముసాయిదా జాబితా ప్రచురణ, ఫిర్యాదులు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం దశలు పూర్తి చేసుకొని తుది జాబితా ప్రచురణకై అనుమతి కొరకు ఎన్నికల సంఘంకు పంపించడం జరిగిందని, అనుమతి పొందిన అనంతరం ఈ నెల 6వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమం జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించడం జరిగిందని, ముసాయిదా జాబితాపై వచ్చిన 434 ఫిర్యాదులు / అభ్యంతరాలను స్వీకరించి 427 పరిష్కరించడం జరిగిందని, 7 పున:పరిశీలన చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 1000 మంది పురుషులకు గాను 1 వేయి 23 మహిళలు ఉన్నారని, 683 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని తెలిపారు. 23 వేల 967 ఎపిక్ కార్డులకు గాను 8 వేల 74 కార్డులు తయారై పంపిణీ చేయడం జరిగిందని, మిగతా త్వరలో అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 6వ తేదీన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు తుది ఓటరు జాబితా అందించడం జరుగుతుందని, పోలింగ్ కేంద్రాలు, తహశిల్దార్, రాజస్వ మండల అధికారి, ఇతర సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలలో ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే



**ఉట్నూర్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని అయ్యప్ప దేవాలయాన్ని గురువారం ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అంతకు ముందు అయ్యప్ప దీక్షపరులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.అనంతరం అయ్యప్ప స్వాములతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐటీడీఏ ఈఈ భీంరావు, పాక్స్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, నాయకులు, అయ్యప్ప స్వామి దీక్షపరులు ఉన్నారు.



## దరఖాస్తుల ఆహ్వానం..

**ఆదిలాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్‌లో ఖాళీగా ఉన్న కంప్యూటర్ సైన్స్ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.జె. సంగీత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీ సంబంధిత సబ్జెక్టులో కనీసం 55% మార్కులు కలిగి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉన్నా అర్హులేనన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డి కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ప్రకటనలో సూచించారు.

# దొంగతనానికి పాల్పడిన నిందితుల అరెస్ట్

## నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల

**భైంసా, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
ఇటీవల భైంసా పట్టణ శివార్ బోకర్ రోడ్డులో గల నాగదేవత ఆలయంలో భైంసా మండలం చూచుండ్ గ్రామానికి చెందిన గడపాలే సంగరతన్ మరియు షానె విశాల్ అనే ఇద్దరు దుండగులు హుండి, ఆలయ గంటల దొంగతనానికి పాల్పడ్డారని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. పట్టణ ఓల్డ్ పోలీస్ స్టేషన్ ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... సదరు నిందితులు జల్సాలకు అలవాటు పడి పథకం ప్రకారం నాగదేవత ఆలయం లో దొంగతనం చేశారన్నారు. సి.సి కెమెరాలు, పోలీసుల సహకా రంతో కేవలం 24 గంటల్లోనే దొంగతనం చేసిన నిందితు లను చాచక్యంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నమన్నారు. వారివద్ద కొంత సొత్తుని, గుడి గంటలను స్వాధీనపరచుకొని రిమాండ్ తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ తమ ప్రార్థనా స్థలాలు, వ్యాపార సముదాయాలు మరియు నివా సాలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వాటి వల్ల నేరాలను అదుపులో చేయవచ్చని కోరారు. పెట్రోలింగ్ వ్య వస్థ బలోపేతం అయ్యిందని, 48 గంటల్లోనే దొంగతనం కేసును ఛేదించి దొంగలని పట్టుకోవటంలో ఇన్ఫర్మేషన్ సేకరించి చాక చక్యంగా వ్యవహరించిన టౌన్ ఇన్స్పెక్టర్ గోపీనాథ్, ఎస్ఐ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ లను ఎస్.పి అభినందించారు. ఎస్పీ చేతుల మీదుగా హెడ్ కానిస్టేబుల్ ఆనంద్, కానిస్టేబుల్స్ ప్రమోద్ కుమార్, అంబదాస్‌కు రివార్డు అందించారు. సమావేశంలో ఏఎస్పీ అవినాష్ కుమార్, సిఐ, ఎస్ఐలు ఉన్నారు.

# సామాజిక అంశాలపై కళాబృందం అవగాహన

**కౌటాల, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు పర్యవేక్షణలో కౌటల పోలీస్ స్టేషన్ పరిధిలోని కన్నెపల్లి గ్రామం లో పోలీస్ కళాబృందం వారు నూతన చట్టాలు,రోడ్డు ప్రమాదాలు మరియు ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, గంజాయి నివారణ పై అవగాహన, సీసీ కెమెరాల యొక్క ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమం లో భాగంగా సీ.ఐ రమేష్ మాట్లాడుతూ ఈ మధ్యకాలం లో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, ఎవరైనా మోసపోయినట్లైతే 1930 నంబర్‌కి పిర్యాదు చేయాలని,పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. దీని వల్ల గ్రామంలో ఏ సంఘటన జరిగిన వెంటనే తెలుస్తోంది అని తెలిపారు, సిసి కెమెరాలు ఏర్పాటు సహకరించలని గ్రామస్థులను కోరారు.తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని అన్నారు. యువత చెడు



వ్యసనాలకు అలవాటు పడకూడదని,ప్రభుత్వం ,పోలీస్ తరపున అన్ని విధాల సహాయహకారులు ఉంటాయని అన్నారు. వాహన దారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని, లైసెన్స్ లేకుండ వాహనాలు నడపవద్దని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ఆవశ్యకత గురించి వివరించారు. గ్రామాల్లో అనుమానస్పదంగా వ్యక్తులు కనపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీ.ఐ రమేష్ ,ఎస్.ఐ మధుకర్ మరియు పోలీసు సిబ్బంది, పోలీస్ కళా బృందం సభ్యులు రాంచందర్, రోహిత్, చంద్రశేఖర్, రజిత, సంఘవి, గ్రామస్థులు పాల్గొన్నారు.



## నష్టపరిహార చెక్కు అందజేత

**ఉట్నూర్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
మండలంలోని వంకతుమ్మ-(బి) గ్రామంలో ఇటీవల పెద్దపులి దాడిలో రైతు చాహకటి జంగుకు చెందిన ఆవు మృతి చెందింది. ఈ మేరకు బాధిత రైతుకు 40 వేల నష్టపరిహార చెక్కును ఖానాపూర్ ఎమ్మెల్యే, వైల్డ్ లైఫ్ బోర్డ్ కమిటీ మెంబర్ వెడ్మ బొజ్జు పటేల్ గురువారం అందించారు. బీర్సాయిపేట్ ఎఫ్ఆర్ఓ అరుణ, కవ్వాల్ టైగర్ జోన్ డిప్యూటీ రెంజర్ సీతారాం,బిట్ ఆఫీసర్లు కోసేరావ్, రాజకుమార్ తదితరులున్నారు.

## ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా డేవిడ్ రవికాంత్

**ఆదిలాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారిగా డేవిడ్ రవికాంత్ నియమితులయ్యారు. ఈయన కరీంనగర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్‌గా పనిచేస్తుండగా.. ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా అదనపు బాధ్యతలను అప్పగించింది. గురువారం ఆయన ఆదిలాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన నరసింహారెడ్డి ఇటీవల పదవీ విరమణ పొందారు.



## 5న జన్నారంలో మెగా ఉచిత వైద్య శిబిరం

**జన్నారం, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండల కేంద్రంలోని రాఘవేంద్ర విద్యాసంస్థలు జన్నారంమరియు మెడ్ లైఫ్ ఆసుపత్రి మంచిర్యాల వారి ఆధ్వర్యంలో రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల ఆవరణలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తు, ఉచిత మందులను పంపిణీ చేస్తున్నట్లు మాజీ జెడ్పిటిసి ఎర్ర చంద్రశేఖర్ గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెగా ఉచిత వైద్య శిబిరం ఈనెల 5 వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో ఊపిరితిత్తుల పరీక్షలు, స్కానింగ్ పరీక్షలు, కంటి వైద్య పరీక్షలు, గుండె, షుగర్, వినికిడి మాటలకు సంబంధించిన పరీక్షలను సంబంధిత వైద్యుల పర్యవేక్షణలో ఉచితంగా నిర్వహిస్తున్నట్లు, ఉచిత మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వృద్ధులు, వికలాంగుల కొరకు వాహన సదుపాయం కల్పించినట్లు తెలిపారు.



## రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లావాసి ప్రతిభ

**ముథోల్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన సీఎంకప్ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా వాసి ప్రతిభ చాటాడు. తానూర్ మండలం హిప్పెల్లికి చెందిన వార్లే దిలీప్ అత్యుత్తమ ప్రదర్శనతో రజత పతకం సాధించినట్లు యోగా గురువు మల్లేశ్ తెలిపారు. తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందన్ కృపాకర్, రాష్ట్ర సంయుక్త ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంరెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ తోట సతీశ్, నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ దిలీపన్ను అభినందించినట్లు పేర్కొన్నారు.

## రహదారి భద్రతపై అవగాహన ఉండాలి

**ఆదిలాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
ప్రయాణికులు రహదారి భద్రతపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించాలని, రహదారి భద్రత నియమాలు పాటించాలని సూచించారు. కళాజాతలో కళాకారులు పాటల రూపంలో రోడ్డు భద్రతపై ప్రదర్శన నిర్వహించారు. ఆర్ఎం సూపరింటెండెంట్ పోతారెడ్డి, ట్రాఫిక్ సూపర్వైజర్ పోశెట్టి, ఆయిల్ డీసీ వందన తదితరులున్నారు.

## గిరిజన శాఖ ఉద్యోగుల జిల్లా కార్యవర్గం ఎన్నిక

**ఆసిఫాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
గిరిజన శాఖలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పీఎంహెచ్ బాలికల పాఠశాలలో గురువారం రాష్ట్ర అధ్యక్షుడు యాకుబ్, ప్రధాన కార్యదర్శి వాలుసింహ, కోశాధికారి జైతు, ఎన్నికల అధికారి ఏసీఎంవో ఉద్దవ్ సమక్షంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా రాంచందర్, ఉపాధ్యక్షులుగా కోటయ్య, రవి, ప్రధాన కార్యదర్శిగా పోచం, సహాయ కార్యదర్శులుగా ఓంకార్, కై లాస్, జిల్లా ఆఫీస్ కార్యదర్శులుగా మహేశ్, వసంత్, ప్రచార కార్యదర్శులుగా ఉపేందర్, చిరంజీవి, కోశాధికారిగా చంద్రమోహన్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రేణుకా బాయి, శంకర్ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా వనిత, సంగీత, శివప్రసాద్, రమేశ్, తెలంగారావు, చంద్రయ్య, చంద్రకాంత్, బాపు, మౌనిక, రమణ, సీతారాం, వినోద్, వెంకటేశ్, సురేందర్, నాందేవ్, లలిత, రాధాబాయిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. నూతన జిల్లాకార్యవర్గం ఐదేళ్లు కొనసాగుతుందన్నారు.



# అధికారులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి





## రామగుండం సీపీ శ్రీనివాస్

**మంచిర్యాల, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
అధికారులు అంకితభావంతో నిధులు నిర్వర్తించాలని రామగుండం కమిషనర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా గురు వారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో రామగుండం కమిషనరేట్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడ జనవరి 1వ తేది నుండి 31 వ తేది వరకు నిర్వహిస్తున్న ఆపరేషన్ స్మైల్ ను ప్రతి ఒక్కరు అంకి తభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఆపరేషన్ స్మైల్‌లో పాలుపంచుకొంటున్న ఒక్క అధికారి ముగ్గురు పిల్లలను రెస్క్యూ చేయాలనీ కోరారు. ప్రతీ ఒక్కరి జీవితంలో బాల్యం అమూల్యమైనదని, దానిని అనుభవించటం ప్రతీ పౌరుని హక్కు అని అన్నారు. కానీ క్షణికావేశంలో పిల్లలు తొందర పాటులో చిన్న చిన్న విషయాలకే తల్లి దండ్రులను విడిచి ఇంటికి దూరంగా ఉంటున్నారని, ఇట్టి అవకాశాన్ని ఆ సరాగా తీసుకొని కొందరు వారిని ప్రమాదకర పనుల్లో వా రితో పనులు చేయిస్తూ వారి జీవితాలతో ఆడుకుంటున్నా రని అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తప్పి పోయిన పిల్లలను వెతికి 'దర్పణ్ 'అప్లికేషన్ ద్వారా వారిని గుర్తించి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హా జరు పరచి, తిరిగి తల్లి దండ్రుల వద్దకు చేర్చి వారి శోకాన్ని తీర్చాలని అన్నారు. బిక్షాటన చేస్తున్న వారి గురించి, బాలకా ర్మికుల గురించి ఎప్పటి కప్పుడు సమాచారం ఇవ్వడానికి చైల్డ్ హెల్ప్ లైన్ కు చెందిన 1098,112 నెంబర్ల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. ప్రతీ పోలీస్ డివిజన్ స్థాయిలో ఒక సబ్-ఇన్స్పెక్టర్ తో పాటుగా ఒక మహిళా పోలీస్ అధికారి, నలుగురు సిబ్బంది, వివిధ డి పార్ట్మెంట్ అధికారులతో నెల రోజుల పాటు ఇదే పనిపై ఇటుక బట్టి లు, వివిధ రకాల పరిశ్రమలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, ట్రాఫిక్ జంక్షన్లు, క్షుణ్ణంగా పరిశీలించి కుటుం బాలకు దూరంగా ఉంటున్న పిల్లలను గుర్తించాలని అన్నా రు. స్కూల్స్ కు వెళ్లకుండా వివిధ కారణాల వల్ల డ్రాపౌట్ అయిన పిల్లల తల్లి దండ్రులకు నచ్చ చెప్పి తిరిగి వారిని పాఠశాల కు పంపే ఏర్పాటు చేసి వారికి కొత్త జీవితాన్ని ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, ఎ.సి.పి. మల్లారెడ్డి, ఇన్స్పెక్టర్ రమేష్ బాబు, ఎస్.ఐ రాజేష్, శైలజ, లచ్చన్న, శరణ్య, సి.డబ్లు.సి ఛైర్మెన్ శ్రీధర్, డీ.ఏం హెచ్.ఓ అన్నప్రసన్న కుమారి, లేబర్ ఆఫీసర్ హేమలత, సత్యనారాయణ, డి.సి.పి.ఓ కమలాకర్, ఆనంద్, పి.ఓ జితేందర్, డి.ఇ.ఓ సెక్టర్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, అజీముద్దీన్ దబీర్, సంజీ వయ్య, లీగల్ ప్రొబేషనరీ ఆఫీసర్- రజీత, చైల్డ్ లైన్ ఉమాదేవి, రమాదేవి, ప్రవీణ్ కుమార్, సి.డబ్లు. సి మెంబర్ శ్యామ్ సుందర్, సుమలత, సబ్ డివిజనల్ ఇన్చార్జి, టీం సభ్యులు పాల్గొన్నారు.

## సహకార సంఘం విలీనానికి తీర్మానం

**నార్నూర్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్ర కార్యాలయంలో చైర్మన్ ఆడే సురేశ్ గురువారం డైరెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నూతనంగా ఏర్పడిన గాదిగూడ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ నవీనకళ మాట్లాడుతూ.. జిల్లాలో ఐదు సొసైటీలను నూతనంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఇందులో ఆదిలాబాద్లోని బోరాజ్, తాంసి పరిధిలోని భీంపూర్, ఇచ్చోడ పరిధిలోని సిరికొండ, సోనాల గ్రామాలతో పాటు నార్నూర్ పరిధిలోని గాదిగూడ మండల కేంద్రంలో నూతనంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సహకార సంఘం పరిధిలో 48 గ్రామపంచాయతీలుండగా 54 గ్రామాలున్నాయని తెలిపారు. 30 గ్రామాలు నూతనంగా ఏర్పాటు చేయనున్న గాదిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో విలీనం అవుతాయని వివరించారు.



## విద్యార్థులకు కథల పోటీలు

**ఆదిలాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
సంక్రాంతి సందర్భంగా జిల్లాలోని పాఠశాలల విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించనున్నట్లు శాంతినగర్ పిల్లల లైబ్రరీ నిర్వాహకులు పోరెడ్డి అశోక్-వసుధ ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి పదోతరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. తోచిన అంశంపై రెండు పేజీలకు మించకుండా కథ రాయాలని, కాపీ, అనుకరణ, అనుసరణ కాదని తెలుపుతూ ప్రధానోపాధ్యాయుడి హామీపత్రం జత చేయాలని సూచించారు. రాసిన కథలను ఈ నెల 20లోపు పోస్ట్ ద్వారా లేదా 'స్వయంగా శాంతినగర్ పిల్లల లైబ్రరీకి పంపించాలని, పూర్తి వివరాలకు 9441473049 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి నిర్మల్, మంచిర్యాల జిల్లాల రైతాంగానికి సాగునీరు అందించడంతోపాటు తాగునీటి అవసరాలు తీర్చే బహుళార్ధ ప్రాజెక్టు కడెం మరమ్మతులు పూర్తయ్యాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పలుసార్లు తీవ్ర నిర్లక్ష్యానికి గురైన కడెం ప్రాజెక్టు కింది ఆయకట్టు రైతాంగం అనేక అవస్థలను ఎదుర్కొన్నది. అయితే ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ప్రాజెక్టుపై పరిస్థితిపై పలుసార్లు నివేదించారు. ప్రాజెక్టు ప్రధాన ఆనకట్ట తెగిపోవడంతో పాటు పలుసార్లు గేట్ల మరమ్మతుకు సంబంధించి రైతాంగం ఇబ్బందులను ఎదుర్కొన్నది. అయితే ప్రభుత్వం ఎట్టకేలకు నిధులు మంజూరు చేయడంతో మరమ్మతులు పూర్తయ్యాయి.

### రూ .10 కోట్లతో మరమ్మత్తులు..

కడం ప్రాజెక్ట్ గేట్లకు సంబంధించి తీవ్రమైన ఇబ్బందులు ఎదురయ్యాయి పలు గేట్లు మొరాయించడం తోపాటు... కొన్ని గేట్లు దిగకపోవడం, మరికొన్ని గేట్ల నుంచి నిరంతరం నీటి లీకేజీలు కొనసాగడం వంటి సమస్యలు ఎదురయ్యాయి. వీటికి తోడు ప్రాజెక్టు మరమ్మత్తులు తీవ్రంగా ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సుమారు 10 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో పూర్తిస్థాయిలో కాకపోయినా... వచ్చే సీజన్ కు సంబంధించిన రైతులు సమస్యలు ఎదుర్కోకుండా ఉండేందుకు పలు మరమత్తు పనులు చేపట్టారు. దీంతో ప్రాజెక్టు కింది ఆయకట్టుకు నీరు విడుదల చేసేందుకు మార్గం సుగమం అయింది.

### ట్రయల్‌రన్ విజయవంతం..

యాసంగి సాగు కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా అందించేందుకు ఇటీవల ట్రయల్‌రన్ నిర్వహించగా విజయవంతమైంది. దీంతో నీటి విడుదలకు ఇబ్బందులు తొలగిపోయాయి. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు. కాగా ప్రస్తుతం 605 అడుగుల నీరు ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీసీఎంసీలకు ప్రస్తుతం 19.56 టీఎంసీలు ఉంది. కడెం ప్రాజెక్టులో ఉన్న నీరు ఆరుతడి పంటలకే సరిపోతుందని చెబుతు న్నారు. దీంతో యాసంగిలో వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.




■ ప్రాజెక్టు మరమ్మతు పనులు పూర్తి
■ రూ.10కోట్లతో ప్రాజెక్టుకు మర్మతులు
■ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రత్యేక చొరవతో నీటి విడుదలకు సన్నాహాలు
■ ట్రయల్‌రన్ విజయవంతం..
■ ప్రాజెక్టుల్లో సరిపడా నీరు..
■ 5నుంచి దిగువకు నీటి విడుదల
■ 16వేల ఎకరాలకు అందనున్న సాగు నీరు
■ ఆయకట్టు రైతుల్లో హర్షం..

### ప్రాజెక్టులో సరిపడా నీరు ఉండడంతో..

ప్రాజెక్టుల్లో సరిపడా నీరు ఉండడంతో యాసంగి సాగుకు నీరు అందించేందుకు ప్రజాప్రతినిధులు, అధికా రులు ఏర్పాట్లు చేస్తున్నారు. కడెం ప్రాజెక్టు మరమ్మతులు పూర్తయిన నేపథ్యంలో జనవరి 5వ తేదీ నుంచి నీరు విడుదల చేసేందుకు ప్రాజెక్టు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కడెం ప్రాజెక్టు కింద డిస్ట్రిబ్యూటరీ 1 నుంచి 42 వరకు కాలవల ద్వారా సుమారు 16వేల ఎకరాలకు నీటిని విడుదల చేయనున్నారు. యాసంగికి నీరు అందనుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### 5 నుంచి నీరు విడుదల...

కడెం ప్రాజెక్టు మరమ్మత్తులు పూర్తయిన నేపథ్యంలో జనవరి 5వ తేదీ నుంచి నీరు విడుదల చేసేందుకు ప్రాజెక్టు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నీరు విడుదల చేస్తే... ఖానాపూర్ నియోజకవర్గంలోని రెండు మండలాలతో పాటు దిగువన ఉన్న మంచిర్యాల జిల్లా వరకు సాగునీరు అందించేందుకు వీలుగా ఉంటుంది. దీంతో రైతాంగంలో హర్షం వ్యక్తం అవుతున్నది.



## ఆపరేషన్ స్మైల్-11ని విజయవంతం చేయాలి

**- బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి**

**- జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు**

**ఆసిఫాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**

జిల్లా వ్యాప్తంగా బాల కార్మికులు, తప్పిపోయిన పిల్లలను గుర్తించడం, అక్రమ రవాణా కు గురైన చిన్నారులను రక్షించి,వారికి పునరావాసం కల్పించేందుకు చేపడుతున్న 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 2025 జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించే పదకొండవ 'ఆపరేషన్ స్మైల్' కార్యక్రమంలో భాగంగా జిల్లాల పోలీసు, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, కార్మిక, విద్య మరియు ఆరోగ్య శాఖలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, ఎన్జీవో అధికారులతో కలిసి జిల్లావ్యాప్తంగా రెండు సబ్ డివిజన్లలో రెండు టీంలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్రమం ద్వారా బాలకార్మికులు, చిన్నారుల దుర్భర స్థితిలో ఉండే ప్రాంతాలను తెలుసుకొని వాటిని బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి చిన్నారులను విముక్తి కలిగించాలన్నారు. ప్రధానంగా రైల్వేస్టేషన్లు, బస్ స్టేషన్లు, ట్రాఫిక్ కూడళ్లు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు, టీస్టాళ్ళు, హోటల్లు, ఫ్యాక్టరీలు, వర్క్ షాప్ లు, దుకాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఆపరేషన్ స్మైల్‌లో చైల్డ్ ట్రాక్ పోర్టల్, ముఖ కవళికలను గుర్తించే దర్పణ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా సత్ఫలితాలనిచ్చిందని అన్నారు. గత సంవత్సరం జూలై నెలలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం ద్వారా 68 మంది పిల్లలను రిస్కు చేసినట్లు తెలియజేశారు. చట్టపరమైన, విధానాపరమైన సమ్మతితో రిస్కు కార్యక్రమాలను ఒక ప్రణాళిక ప్రకారం అమలు చేయాలని తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై సంబంధిత చట్టంలోని సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని, ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. బాల కార్మికుల గురించి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వడానికి చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, 112 నెంబర్ల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచి పనితీరు కనబరిచిన సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ప్రభాకర్ రావు, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మహేష్, డిఎంఅండ్‌హెచ్ ఓ సీతారాం, డీఈఓ యాదయ్య, రెండు డివిజన్‌లలో ఏర్పాటుచేసిన టీంలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# నూతన సంవత్సరంలో జిల్లాను ముందంజలో నిలుపుదాం





## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**

నూతన సంవత్సరంలో నిర్మల్ జిల్లా మరింత ప్రగతి సాధించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో జిల్లాను ముందంజలో నిలిపేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా అధికారులు, పలు కార్యాలయాల సిబ్బంది కలెక్టర్ అభిలాష అభినవ్ ను కలిసి పూల మొక్కలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అధికారులు, కార్యాలయాల సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు నూతన సంవత్సరం లో కొత్త ఉత్సాహంతో ముందు కెళ్లాలని తెలిపారు. అధికారులు, సిబ్బందికి కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ, జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని, ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో ఉండాలని, అనుకున్న కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని, పంటలు సమృద్ధిగా పండి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని మనసారా కోరుకుంటున్నానని అన్నారు. ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, జిల్లాను మరి సుసంపన్నం చేసేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన వారందరు నోట్ బుక్కులు తీసుకురాగా, కలెక్టర్ వాటిని వసతి గృహాల విద్యార్థులకు పంపిణీ చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతన సంవత్సరం సందర్భంగా విద్యార్థులకు తోడ్పాటును అందించిన వారందరికీ కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసిన నిర్మల్ అదనపు ఎస్పీ రాజేష్ మీనా..

నిర్మల్‌కు నూతనంగా సబ్ డివిజన్ అదనపు ఎస్పీగా నియమితులైన రాజేష్ మీనా జిల్లా కాలెక్టర్ అభిలాష అభినవ్ ను గురువారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి, పూలమొక్కను అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇరువురు జిల్లా స్థితిగతులపై చర్చించారు. జిల్లాకు బదిలీపై వచ్చిన సబ్ డివిజన్ అదనపు ఎస్పీకి కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.



# సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన



**ఆదిలాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**

ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్తో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె 24వ రోజుకు చేరింది. గురువారం సీఎం రే వంత్రెడ్డి, మంత్రుల ఫొటోలతో కూడిన మాస్కులు ధరించి కలెక్టరేట్ సమ్మె శిబిరం నుంచి కలెక్టర్ చౌక్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడల రవీందర్ మాట్లాడుతూ.. ఇప్పటికై నా ప్రభుత్వం స్పందించి హామీలు అమలు చేయకుంటే సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రియాంక, ప్రధాన కార్యదర్శి ధరమ్సింగ్, వెంకటి, పార్థసారథి, శ్రీకాంత్, ప్రవీణ్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు చేరిన ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్





**ఆదిలాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**

ఎస్సీ వర్గీకరణపై హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ షమీమ్ అక్తర్ నియమించిన ఏకసభ్య కమిషన్ గురువా రం రాత్రి జిల్లాకు చేరింది. స్థానిక పెన్‌గా గెస్ట్ హౌస్లో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి కమి షన్ సభ్యులను మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమొక్క అందించి స్వాగతం పలికా రు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 వరకు ఆయన వర్గీకరణపై దళిత సంఘాలు, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు.



## వికలాంగులకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన ఎస్పీ

**నిర్మల్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**

సమాజంలో ప్రతి ఒక్కరు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. గురువారం నిర్మల్ మండలం కొండాపూర్ గ్రామంలోని శాంతినికేతన్ మానసిక వికలాంగుల కేంద్రంలో నూతన సంవత్సర సందర్భంగా వికలాంగులు వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగంలో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ మీరందరిని కలవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. డైరెక్టర్ జనార్ధన్ కృష్ణంరాజు చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు చిత్రపటం అందజేత

**బెల్లంపల్లి, జనవరి 2 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ని గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపి చిరుకానుక అందించారు కొండ గొర్ల అన్నయ్య ఫౌండేషన్, కాంగ్రెస్ కో నాయకుడు కొండగుర్ల వేద ప్రకాష్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, బెల్లంపల్లి నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు.



# అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి





## ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఉట్నూర్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. గురువారం ఉట్నూరు మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ నియోజవర్గం లోని అన్ని మండలాల ఎంపీడీవో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023 సంవత్సరం నుండి నేటి వరకు జరిగిన అభివృద్ధి పనులతో పాటు నేటికీ జరుగుతున్న పనులపై ఆరా తిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. అధికారులు ఎల్లవేళలా ప్రజా క్షేత్రంలో ఉంటూ బాధ్యతయుతంగా తమ కర్తవ్యాలను నిర్వర్తించాలన్నారు. అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. ఏ సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎంపీడీఓలు ఎమ్మెల్యేను కానుక అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తనను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారికి అభినందలు తెలిపారు. కార్యక్రమంలో అన్ని మండలాల ఎంపీడీఓలు రమా కాంత్, భాస్కర్, శశికళ, రాంప్రసాద్,అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లాకు రానున్న
# ఏకసభ్య కమిషన్ ప్రతినిధి



**ఆదిలాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి డా.షమీమ్ అక్తర్ ఈ నెల 3 జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ పై కలెక్టరేట్ సమావేశ మందిరంలో బహిరంగ విచారణ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు జరగనున్న విచారణలో ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ కుల సంఘాల నాయకులు, ప్రజలు అభిప్రాయాలను, వినతులను సమర్పించవచన్నారు.

# కలెక్టరేట్ ఎదుట ఆదివాసీల ఆందోళన

**ఆదిలాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని కుమురం భీం కాలనీలో నివాసం ఉంటున్న ఆదివాసులకు సౌకర్యాలు కల్పించాలని తుడుం దెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ అన్నారు. సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్ తో గురువారం కాలనీ నుంచి ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కరెంట్ స్తంభాలు, లైట్లు పోలిన వాటిని చూపిస్తు ఆందోళన చేపట్టారు. ధర్నా విషయమై పోలీసులు ముందస్తుగానే కలెక్టరేట్ ఎదుట భారీ పోలీసులను మోహరించి బందోబస్తు చేపట్టారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ మాట్లాడుతూ కుమురం భీం కాలనీలో నివాసం ఉంటున్న ఆదివాసులకు విద్య, వైద్యం, కరెంట్ లాంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. పిల్లల భవిష్యత్తుకు జిల్లా కేంద్రంలోని కుమురం భీం కాలనీలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారన్నారు. పట్టాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని దరఖాస్తులు ఇచ్చిన.. దండాలు పెట్టిన ఎలాంటి చర్యలు లేవన్నారు. తాము ఆదివాసులుగా పుట్టడం నేరమ అని ప్రశ్నించారు. కరెంట్ లేకపోవడంతో రాత్రి సమయంలో విషసర్పలతో సమజీవనం చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు,




అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవి వారి వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. కార్యక్రమంలో కార్యదర్శి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షు రాలు రేణుక, విద్యార్థి సంఘం జిల్లా ఉపధ్యక్షులు వరుణ్, మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు ఉయిక ఇంద్, మహిళా సంఘం డివిజన్ అధ్యక్షురాలు లలిత బాయి, డివిజన్ ఉపాధ్యక్షులు గణపతి, రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు బుజంగ్ రావ్, రైతు సంఘం డివిజన్ ఉపాధ్యక్షులు తులసి రాం, మావల మండల అధ్యక్షుడు ముకుంద్ రావ్, రూరల్ మండల అధ్యక్షులు కేశవ్ పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ మెడికల్ కళాశాల ఎదుట
# విద్యార్థుల ఆందోళన
## కళాశాల ఎదుట బైఠాయించి నిరసన




**ఆసిఫాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
మెడికల్ కాలేజ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మెడికల్ కాలేజ్ విద్యార్థులు గురువారం కళాశాల ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలలో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేక భోధనకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కనీసం ల్యాబ్ లో సరిపడా సౌకర్యాలు కల్పించలేదని ఆరోపించారు. ప్రొఫెసర్లను నియమించకుండా మెడికల్ కాలేజ్ ను ఎందుకు ఏర్పాటు చేశారని అధికారులను ప్రశ్నించారు. బోధన ఇతర సౌకర్యాలు లేక డాక్టర్ చదవులను ఎలా పూర్తి చేయాలని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించడంతో పాటు కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. వారి ధర్నాకు కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దిన్ కార్, పీడీఎస్యూ ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

## బోథ్ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల
# ప్రిన్సిపల్‌గా డాక్టర్ శివకృష్ణ




**బోథ్ (ఆదిలాబాద్), జనవరి 2 (ప్రభాత సమాచారం)**
బోథ్ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ శివకృష్ణను నియమిస్తూ టీజీటీడబ్ల్యూఆర్ఈఐ సెక్రెటరీ ఉత్తర్వులు జారీ చేశారు. 14 మందికి ప్రమోషన్లు ఇస్తూ డిపార్ట్ మెంటల్ ప్రమోషన్ కమిటీ ఇటీవల ఆమోదం తెలిపింది. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి శివకృష్ణ ఒక్కరికే అవకాశం లభించింది. కెమిస్ట్రీ లెక్చరర్‌గా ఉన్న డా.శివకృష్ణ.. గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా వ్యవహరించనున్నారు. కొత్త ప్రిన్సిపాళ్లకు వెంటనే బాధ్యతలు అప్పగించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు





## ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా..

**ఆదిలాబాద్, జనవరి 2 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలో నెలకొన్న ట్రాఫిక్ స మస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మునిసిపల్, పోలీస్ అధికారులు, కౌన్సిలర్లతో ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని అంబేద్కర్ చౌక్, గాంధీచౌక్, వినాయక్ చౌక్లతో పాటు ప్రధాన రోడ్డు వెంబడి ఉన్న చిరువ్యాపారుల దుకాణాలను తొలగించి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. శివాజీ చౌక్ లోని కూరగాయల మార్కెట్, గణేశ్ థియేటర్ స్థలంలో చిరువ్యాపా రులకు స్థలాలు కేటాయించనున్నట్లు తెలిపారు. ఆదివారం అంబేద్కర్ చౌక్ నుంచి గాంధీ చౌక్ వరకు జరిగే వారసంత కారణంగాట్రాఫిక్ సమస్య ఉన్నందున ఆ రోజు ఆటోలు, ఇతర వాహనాలకు అనుమతి నిరాకరించనున్నట్లు పేర్కొన్నారు. మునిసిపల్ కమిషనర్ రాజు, టీపీవో సుమలత, డీఈ తిరుపతి, మెప్మా డీఎంసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.